క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బుచ్చయ్య


ఇన్‌చార్జ్ తహసీల్దార్ బుచ్చయ్య

పాలకొండ: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బి.బుచ్చయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈయన పాలకొండ తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉండగా, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు కేటాయించడం విశేషం. ప్రస్తుతమున్న తహసీల్దార్ సెలవులో ఉన్నందున ఆయన వచ్చేంత వరకు ఈయన తహసీల్దార్‌గా కొనసాగుతారు.

భూముల రీసర్వే ప్రారంభం

పాలకొండ రూరల్: స్థానిక పట్టణ పరిధిలోని 1 నుంచి 12వ నంబర్ సర్వే వరకు ఉన్న 55 ఎకరాల్లో భూముల రీసర్వే సోమవారం ప్రారంభించారు. మండల సర్వేయర్ పి.వెంకటరావు పర్యవేక్షణలో సర్వేయర్లు నాగరాజు, మణి, వీఆర్‌ఓలు సాయి, రమేష్, శ్రావణ సందీప్, జయసుధ, మేఘన, రామారావు సర్వే నిర్వహించి, హద్దులు గుర్తించారు. తదితరులు సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆమె ఇప్పటికే రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు తరలించడం జరుగుతోందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'వలంటీర్లకు వందనం'


వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైన వారిని సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఎంపీడీఓ కొండపల్లి సత్యం సత్కరించారు. మంచి సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, ఇదే స్ఫూర్తితో ముందు కూడా పనిచేసి, మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు.

టీడీపీ మేనిఫెస్టో ఓ అభూత కల్పన

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం:

టీడీపీ మేనిఫెస్టో ఓ అభూత కల్పనని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహానాడులో టీడీపీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టోపై మీడియా సమావేశం నిర్వహించి, ఆయా నేతలు మండిపడ్డారు. అబద్ధపు హామీలతో ఇంకా ఎన్నిసార్లు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. మేనిఫెస్టోలోని హామీలన్నీ ఇక్కడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, కర్ణాటకలో ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నుంచి కాపీ కొట్టినవేనని విమర్శించారు. హామీల్లో ఒకటైన అమ్మకు వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తానంటున్నారని, ఇది మన రాష్ట్రంలోని జగనన్న అమ్మఒడి పథకం నుంచి కాపీ కొట్టిందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమన్న మరొక హామీ కర్ణాటకలో ఎన్నికలప్పుడు బీజేపీ ప్రకటించిన హామీ అని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ కూడా కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందేనని టీడీపీ మేనిఫెస్టో అంతా కాపీ, పేస్ట్ అని ధ్వజమెత్తారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా పథకాలు అమలు చేస్తుంటే, వీటిని చూసి ఆర్థిక సంక్షోభం వస్తుందని, మరో శ్రీలంక, ఉక్రెయిన్ అవుతుందని విమర్శించిన టీడీపీయే మళ్లీ ఇలాంటి ఉచిత హామీలు ఇవ్వడం వెనక ఉన్న రహస్యం గమనించాలని ప్రజలను కోరారు. 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చిన ఆ పార్టీ వాటిలో 10 శాతం కూడా నెరవేర్చలేదని, ఇప్పుడు మళ్లీ ఉచిత హామీలతో మరోసారి ప్రజలను మోసగించేందుకు సిద్ధమైందని దుయ్యబట్టారు. తన మాటలతో ప్రజలను ఎలాగైనా మోసగించగలనన్న భ్రమలో చంద్రబాబు ఉన్నారని, ఆయన మాయ మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. పేదలను ధనికులను చేస్తానంటున్న ఆయన ఇన్నాళ్లు ఏం చేశారని నిలదీశారు. అమరావతిలో నిరుపేదల సొంతింటి కోసం ప్రభుత్వం సెంటు స్థలం కేటాయించి, ఇస్తే దానిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది కాకే ఆ స్థలాన్ని సమాధికి సరిపడే స్థలంగా పోల్చి, వారిని అవమానించింది మీరు కాదా ధ్వజమెత్తారు. సొంత మామ ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచి, పార్టీని లాక్కున్న ఘనత చంద్రబాబుది అని, ప్రజలను మోసం చేయరన్న గ్యారంటీ ఏంటి అని అన్నారు. టీడీపీ మేనిఫెస్టోను ఎవరూ నమ్మడం లేదని, 2024 ఎన్నికల్లోనూ ఆ పార్టీకి పరాభవం తప్పదని జోష్యం చెప్పారు.

నేడు పాలకొండలో బైక్ ర్యాలీ..

అమరావతిలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమాధులతో పోల్చడాన్ని నిరసిస్తూ పాలకొండ మండల కేంద్రంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ర్యాలీకి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని, కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం


మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం/జియ్యమ్మవలస: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస మండలంలోని దోడ్డ గిరిజన గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల బాగోగులే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని, అబద్ధపు హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిందని, అయితే ఆ మేనిఫెస్టోను ఎవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్, డీసీసీబీ డైరెక్టర్ ఎల్.నారాయణరావు, మాజీ జెడ్పీటీసీ కె.బలరాం, చిన్నమేరంగి సర్పంచ్ ఎ.రవణమ్మ, ఎంపీటీసీ ఎం.అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించండి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి


సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, హెచ్‌డబ్ల్యూఓలతో సోమవారం సమావేశమైన ఆమె గిరిజన గ్రామాల్లో డ్రాపౌట్ల జాబితా తయారు చేసి, వారిని బడిలో చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనబడి నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను కూడా విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించిన రోజే ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, తరచూ వారి ఆరోగ్యాన్ని పరీక్షించాలన్నారు. ఏకలవ్య పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. బాలికల పాఠశాలలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో శతశాతం పిల్లల హాజరు నమోదు ఉండేలా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ సూర్యనారాయణ, ఓఎస్ డీ యుగంధర్, డీఈ కృష్ణకుమార్, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏటీడబ్ల్యూఓ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు


పాలకొండ: సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: వలంటీర్లు సంక్షేమ వారధులని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రశంసించారు. సోమవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ గ్రామ, వార్డు వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో ఆయా నేతలు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ వై.రాధాకుమారి, కమిషనర్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని లుంబూరు గ్రామంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను వైఎస్ ఎంపీపీ సూర్యప్రకాష్, సర్పంచ్ ఉపేంద్ర, ఎంపీడీఓ డొంక త్రినాథులు సత్కరించారు.

రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: పాలకొండ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో జూన్ 1వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవానికి అందరూ తరలివచ్చి, కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బందితో సోమవారం సమావేశమైన వారు వాస్తవానికి మే 30వ తేదీన నిర్వహించాల్సిన రైతు దినోత్సవం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. జూన్ 1న జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులంతా హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఎంపీడీఓ వై.వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి కె.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి'పై అవగాహన సదస్సు

భామిని: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పొలంబడి కార్యక్రమ నిర్వహణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణతో పాటు ప్రకృతి వ్యవసాయ విధానాలు, పంటలకు పట్టే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య అధ్యక్షుడు డి. కృష్ణారావు, కార్యదర్శి జి.అనంతరావు, ప్రకృతి వ్యవసాయ విధాన ప్రచారకులు శివప్రసాద్, అంభోజీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 50 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి 50 వినతులు వచ్చాయని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. వినతుల్లో పులిపుట్టికి చెందిన పి.కరువయ్య గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చాలని, ఏఎన్‌ఎం పోస్టు ఇప్పించాలని మర్రిపాడు గ్రామానికి చెందిన సాయిలక్ష్మి, జీవనోపాధులు పెంపొందించేందుకు రుణ సదుపాయం కల్పించాలని నౌగూడ గ్రామానికి చెందిన సుజాత, రచ్చబండ నిర్మించాలని బంజారుపేట గ్రామస్తులు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కడగండికి చెందిన జాను, జగతపల్లి దీసరిగూడ నుంచి జాతపు జగతిపల్లికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు, పవర్ వీడర్ ఇవ్వాలని సీదిగూడ గిరిజనులు కోరారన్నారు.